సాక్షి
అనకాపల్లి
గురువారం । 17 । అక్టోబర్ । 2024



హోరాహోరీగా క్రీడా పోటీలు

దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా పోటీలు బుధవారం పోటాపోటీగా జరిగాయి. 8లో



వీసీ తనిఖీలు

విశాఖ సిటీ: ఏయూ వీసీ శశిభూషణరావు బుధవారం సైన్స్ కళాశాల పరిధిలో గల పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.



ఎరుకుమాంబకు జలాభిషేకం

విశాఖ: దొండపర్తిలో శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం నిర్వహించారు.

టూర్.. టార్గెట్?



కార్పొరేటర్ల అధ్యయన యాత్ర కోసం హెచ్‌వోడీలపై ఒత్తిళ్లు

రూ.కోటి వసూలు చేసి ఇవ్వాలని కూటమి నేతల హుకుం

- కూటమి నేతల దెబ్బకు జీవీఎంసీ కాంట్రాక్టర్లు బెంబేలు
- అడిగినంత పర్సంటేజీలు ఇచ్చుకోలేమని గగ్గోలు
- ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు కాంట్రాక్టర్ల ఫిర్యాదు?
- ఒక్కో కార్పొరేటర్‌కు రూ.1.19 లక్షలు చెల్లించేందుకు టెండర్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాలేదు.. కానీ కూటమి నేతల వసూళ్ల దెబ్బకు జీవీఎంసీ కాంట్రాక్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. ఇంత మొత్తం ఇవ్వాల్సిందేనని టార్గెట్లు విధించి మరీ వసూళ్లకు తెగబడిన వైనంపై కాంట్రాక్టర్లు మండిపడుతున్నారు. కూటమి కార్పొరేటర్లు డిమాండ్ చేసిన స్థాయిలో పర్సంటేజీలు ఇచ్చుకోలేమని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు విన్నవించుకోవాలని కొంత మంది కాంట్రాక్టర్లు నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఈ మేరకు ఎమ్మెల్యే అపాయింట్‌మెంట్ కోరినట్టు తెలిసింది. ఇప్పటికే స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో నామినేషన్‌పై చేసిన పనులకు 8 శాతం పర్సంటేజీని వసూలు చేస్తున్న నేతలు.. ఇప్పుడు మరింత తెగించి జీవీఎంసీలో చేపడుతున్న ప్రతి పనికీ పర్సంటేజీ కావాలంటూ డిమాండ్ చేస్తున్నారు. వారు అడిగినంత పర్సంటేజీలు ఇస్తే తమకు గిట్టుబాటు అయ్యే అవకాశం లేదని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. కూటమి నేతల ఒత్తిళ్లను తట్టుకోలేక విసిగిపోయిన కాంట్రాక్టర్లు.. నేరుగా ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

యాత్ర పేరుతో వసూళ్లు

జీవీఎంసీలో చేపడుతున్న పనులకు కాంట్రాక్టర్ల రక్తం పిండి మరీ వసూళ్లకు తెగబడిన నేతలు.. తాజాగా టూర్ పేరుతో అధికారులకు టార్గెట్ విధించినట్లు తెలుస్తోంది. అధ్యయన యాత్ర పేరుతో జీవీఎంసీ కార్పొరేటర్లు ఈ నెల 20వ తేదీన దక్షిణ భారతయాత్రకు సిద్ధమయ్యారు. ఈ టూర్‌కు అధికారికంగా జీవీఎంసీ ఖాతా నుంచి నిధులు వెచ్చిస్తున్నారు. అయితే దీనిపై కనీసం మేయర్‌కు సమాచారం ఇవ్వకుండా.. ఆమె అనుమతి తీసుకోకుండా టూర్ ప్రోగ్రాం సిద్ధం చేశారు. ముందస్తు అనుమతి ఇవ్వాలంటూ ఇప్పుడు ఏకంగా జీవీఎంసీ ఉన్నతాధికారే ఫైలు పంపడం చర్చనీయాంశమవుతోంది. కాగా.. టూర్‌లో తమ వ్యక్తిగత జల్సాల కోసమంటూ కూటమి నేత ఒకరు వివిధ శాఖల ఉన్నతాధికారులకు టార్గెట్లు విధించారు. అన్ని విభాగాలు కలిపి తమకు కోటి రూపాయలు వసూలు చేసి ఇవ్వాలంటూ లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిసింది. ప్రధానంగా ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. ఇందుకోసం గాజువాకకు చెందిన ఒక కార్పొరేటర్‌కు బాధ్యతలు అప్పగించారు.

గోవాలో గానాబజానా?



కార్పొరేటర్ల టూర్‌లో భాగంగా గోవాకు వెళుతున్న సంగతి తెలిసిందే. అక్కడ తనకు మద్దతిచ్చే కార్పొరేటర్లకు విందుతో పసందు చేసేందుకే కూటమిలోని ఓ నేత సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే అధికారులకు ఇంత మొత్తం ఇవ్వాల్సిందేనంటూ టార్గెట్లు విధించి మరీ వసూలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ఎన్నడూ ఈ తరహా వసూళ్లు లేవని అధికారులు వాపోతున్నారు. ఎంతో కొంత అంటే ఓకేనని.. కచ్చితంగా ఇంత మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేయడం ఎన్నడూ లేదని అంటున్నారు. ఈ వ్యవహారంపై జీవీఎంసీ ఉన్నతాధికారికి ఇప్పటికే పలు విభాగాల అధికారులు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

ప్రజల సొమ్ముతో సోకులు

అధ్యయనం పేరుతో వివిధ ప్రాంతాలకు వెళ్లి అక్కడ అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి తెలుసుకోవడం, వాటిని ఇక్కడ అమలు చేయడం గతంలోనూ చూశాం. గతంలో ఉత్తర భారతదేశ యాత్ర కోసం ఒక్కొక్కరికి రూ.95 వేల ప్యాకేజీని మాత్రమే జీవీఎంసీ చెల్లించింది. అయితే ఈ సారి మాత్రం దక్షిణ భారతదేశ యాత్రకు ఒక్కొక్కరికి ఏకంగా రూ.1.19 లక్షల మేర చెల్లించేందుకు టెండర్ వేశారు. ఒక వైపు ప్యాకేజీ పేరుతో అదనంగా జీవీఎంసీపై భారం మోపిన కూటమి నేతలు.. టూర్‌లో విలాసాల కోసం వివిధ శాఖలకు టార్గెట్లు విధించడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయం జీవీఎంసీ ఉన్నతాధికారి దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. మరి ఆయన చర్యలు తీసుకుంటారా? లేదా చూసీ చూడనట్టు వదిలేస్తారా? చూద్దాం.!


● ఎమ్మార్పీని మించిన ధరలు

కిక్కు దిగింది

- మొదటి రోజే దోపిడీ ప్రారంభం
- షాపు సిబ్బందితో మందుబాబుల వాగ్వాదం
- అదుపు చేయలేక షాపును మూయించిన పోలీసులు



మాకవరపాలెంలో మూతపడిన మద్యం దుకాణం



మాకవరపాలెం: ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు మద్యం విక్రయాలు జరపడంతో మందుబాబులు మండిపడ్డారు. మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం మద్యం దుకాణాన్ని ప్రారంభించారు. ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేయడంతో మందుబాబులు షాపు సిబ్బందితో రాత్రి వాగ్వాదానికి దిగారు. రూ.170 ఉన్న బాటిల్‌కు రూ.230 వసూలు చేయడంతోనే ప్రశ్నించినట్టు మందుబాబులు తెలిపారు. గొడవ తీవ్రస్థాయికి చేరడంతో విషయం తెలుసుకుని పోలీసులు రంగప్రవేశం చేశారు. సర్దిచెప్పేందుకు వారు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో చేసేదిలేక పోలీసులు దగ్గరుండి షాపును మూసివేయించారు. ఈ సందర్భంగా మందుబాబులు మాట్లాడుతూ ఎమ్మార్పీ కంటే అధికం ధరలకు మద్యాన్ని విక్రయిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. అధికారులు నిబంధనలు పాటించని దుకాణాలపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

న్యూస్‌రీల్

'ప్రైవేట్'కు అగ్నిమాపక కేంద్రాల నిర్వహణ

అనకాపల్లి: నక్కపల్లి, రావికమతం అగ్నిమాపక శాఖ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ఇన్‌టైమ్ సర్వీస్ సంస్థకు అప్పగించినట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. ఈ రెండు అగ్నిమాపక కేంద్రాల నిర్వహణకు ఐదు సంవత్సరాల కాల పరిమితికి టెండర్లు కోరామని ఆమె చెప్పారు. ఏడాదికి రూ.20.38 లక్షలు టెండర్ ధరగా నిర్ణయించగా.. తక్కువగా రూ.20 లక్షల 35 వేల 400లు కోట్ చేసిన ఎస్.కవితకు చెందిన ఇన్‌టైమ్ సర్వీసెస్ సంస్థ టెండర్ దక్కించుకున్నట్టు ఆమె చెప్పారు. సీల్డ్ టెండర్లను కలెక్టర్ బుధవారం తన కార్యాలయంలో తెరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హరిపాలెం విజయదుర్గకు కిలో వెండి కిరీటం



అచ్యుతాపురం (మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం హిమగిరి కొండపై వెలసిన శ్రీ విజయదుర్గ అమ్మవారికి కిలో వెండి కిరీటం బహూకరించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా పలువురు దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం శరగడం నారాయణరావు కుమారులు శ్రీనివాసరావు, సన్యాసినాయుడు, మహేశ్వర ప్రసాద్‌తోపాటు శరగడం రామప్పారావు కుమారుడు అప్పలనాయుడు కలిసి కిలో వెండి కిరీటాన్ని అందజేశారు. అమ్మవారికి కిరీటాన్ని అలంకరించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



లచ్చన్నపాలెంలో విచారణ చేస్తున్న సీడీపీవో మేరీ సువార్త

మాకవరపాలెం: బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని లచ్చన్నపాలెంలో బుధవారం రాత్రి 17 ఏళ్ల బాలికకు వివాహం జరుగుతున్నట్టు అందిన సమాచారంతో నర్సీపట్నం సీడీపీవో మేరీ సువార్త అంగన్‌వాడీ సిబ్బందితో కలసి గ్రామానికి చేరుకున్నారు. విచారణ చేపట్టి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, నిబంధనలు పక్కనపెట్టి వివాహం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో తల్లిదండ్రులు బాలికకు పెళ్లి చేసే యత్నాన్ని విరమించుకున్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా సీడీపీవో కోరారు.

వంట గ్యాస్ లీక్ ప్రమాదంలో మూడో వ్యక్తి మృతి



కేజీహెచ్‌లో మృతి చెందిన కృష్ణారెడ్డి

యలమంచిలి రూరల్: మర్రిబంద ఫ్యూజన్ సిమెంట్ ఇటుకల తయారీ పరిశ్రమలో ఈ నెల 5వ తేదీ రాత్రి వంట గ్యాస్ లీక్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడో వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయాడు. గత 11 రోజులుగా విశాఖపట్నం కేజీహెచ్‌లో మృత్యువుతో పోరాడిన కృష్ణారెడ్డి (40) బుధవారం మృతి చెందినట్టు యలమంచిలి రూరల్ ఎస్సై ఎం.ఉపేంద్ర మీడియాకు తెలిపారు. ఈ పరిశ్రమ ఆవరణలో ఒక మూలన ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు నివాసం ఉండడానికి యాజమాన్యం షెడ్లను నిర్మించింది. ఒక గదిలో ఈ నెల 5వ తేదీన వంట గ్యాస్ లీక్ కావడంతో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలానికి చెందిన బడకల కేశవరావు అదే రోజున మృతి చెందగా, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సువానీ గ్రామానికి చెందిన లోక్‌నాథ్ మూలి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 9న ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన మూడో వ్యక్తి కృష్ణారెడ్డి కూడా చికిత్స పొందుతూ బుధవారం ప్రాణాలొదిలారు. పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి మృతుల కుటుంబీకులకు ఒక్కొక్కరికి రూ.6 లక్షలు పరిహారం ఇచ్చేలా ఒప్పించినట్టు సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ తెలిపారు.

ఇద్దరు యువకుల విషాదాంతం

- మృతులిద్దరూ స్నేహితులు
- విశాఖలో డ్రైవర్లుగా విధులు
- స్వగ్రామాలకు బైకుపై వస్తూ గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి



దుర్ఘటన స్థలంలో ప్రతాప్, రాజేష్ మృతదేహాలు





ప్రతాప్, రాజేష్ (ఫైల్)

కశింకోట/నక్కపల్లి : కశింకోట వద్ద జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాలివి. అనకాపల్లి నుంచి యలమంచిలి వెళుతున్న బైక్‌ను ఇక్కడి విల్లా వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో బైకుపై ప్రయాణిస్తున్న నక్కపల్లి మండలం గునుపూడి గ్రామానికి చెందిన కురుందాసు ప్రతాప్(26), అదే మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన బర్నికుల రాజేష్(24) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటనపై బర్నికల కన్నయ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, మృతదేహాలకు పోస్టుమార్టం జరిపించి కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నెల్లిపూడి, గునుపూడిలో విషాదం

ఇద్దరు యువకుల మృతితో నక్కపల్లి మండలంలోని ఇరుగుపొరుగు గ్రామాలైన గునుపూడి, నెల్లిపూడిలో విషాదం నెలకొంది. ప్రమాద వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, స్నేహితులు సంఘటన స్థలానికి బయలుదేరి వెళ్లారు. మృతుల కుటుంబీకులను సర్పంచ్ కె.సురేష్ వర్మ పరామర్శించారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

మృత్యువులోను వారు స్నేహ బంధాన్ని వీడలేదు. రాజేష్, ప్రతాప్ (26)లు డ్రైవింగ్ నేర్చుకుంటున్నప్పుడు వారి మధ్య స్నేహం ఏర్పడింది. డ్రైవర్లుగా పనిచేస్తూ కుటుంబాలకు చేదోడుగా నిలిచేవారు. రాజేష్ ఇంటర్ వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులు లక్ష్మి, కన్నయ్య, సోదరి ఉన్నారు. పెళ్లీడుకు వచ్చిన కుమారుడు అండగా నిలుస్తాడనుకుంటే అర్ధంతరంగా తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవడంతో వృద్ధాప్యంలో తమ కు దిక్కెవరంటూ కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. ప్రతాప్ కూడా కాల్ కారు డ్రైవింగ్ చేస్తున్నాడు. తండ్రి మహాలక్ష్మి 15 ఏళ్ల క్రితమే మృతి చెందాడు. తల్లి రూప, సోదరి ఉన్నారు. ప్రతాప్ డ్రైవింగ్ నేర్చుకొని తల్లికి అండగా నిలుస్తున్నాడు. ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోవడంతో తల్లి గుండెలవిసేలా విలపించింది.

నిబంధనలతో రోడ్డు ప్రమాదాల నివారణ



పోలీస్ స్టాపర్, సైన్ బోర్డులను పరిశీలిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

అనకాపల్లి: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, ఇందుకు వాహనచోదకులు, ప్రజలు పోలీసు సిబ్బందికి సహకరించాలని ఎస్పీ ఎం.దీపిక కోరారు. ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం ఆర్థిక సాయంతో సమకూర్చిన పోలీస్ స్టాపర్, సైన్ బోర్డులను తమ కార్యాలయంలో బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో, జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఈ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. యువత ట్రాఫిక్‌పై అవగాహన కలిగిఉండాలన్నారు. దశలు వారీగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఇన్‌చార్జ్ డీఎస్పీ బి.అప్పారావు, ఎస్‌బీ సీఐ బాల సూర్యరావు, పట్టణ ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ, పట్టణ సీఐ టి.వి.విజయ్‌కుమార్, అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్, సోషల మీడియా సీఐ వినోద్‌బాబు, ట్రాఫిక్ ఎస్ఐ డి.శేఖరం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల చదువుపై మరింత శ్రద్ధ

- కశింకోట భవిత కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



కశింకోట భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల చదువు తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

కశింకోట: దివ్యాంగ విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందించేలా బోధన సాగించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఉపాధ్యాయులకు సూచించారు. వారి చదువు పట్ల మరింత శ్రద్ధ చూపాలన్నారు. స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రం పని తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ చదువుతున్న విద్యార్థులను పేరుపేరునా పలకరించి, వారు చదువుతున్న తీరును పరిశీలించారు. ట్యాబ్‌లు వినియోగించి యాప్‌ల ద్వారా విద్యా బోధన సాగిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. టీఎల్ఎం మెటీరియల్ వినియోగం పట్ల శ్రద్ధ తీసుకొని విద్యా బోధన చేయాలన్నారు. ఎంతమంది విద్యార్థులను ఏటా హైస్కూలుకు పంపిస్తున్నారని ప్రశ్నించగా ముగ్గురని ఉపాధ్యాయులు బదులిచ్చారు. అనంతరం అక్కడి బాలికల పాఠశాలను సందర్శించారు. గణితంలో దస్వీర్ తేజ్, ఆంగ్లంలో అదీనాలను అడిగిన ప్రశ్నలకు బాలికలు అవలీలగా బదులివ్వడంతో సంతృప్తితో ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు, హెచ్ఎం రామునాయుడును ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టీని, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ఐఈ సమన్వయకర్త బి.శకుంతల, ఎంఈవో పి.వెంకట సురేష్, భవిత కేంద్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో వివాహాలు నిర్వహించరాదు

పాఠశాల ఆవరణలో స్థానిక యువకుడి వివాహానికి ఏర్పాట్లు చేయడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఎవరు అనుమతి ఇచ్చారని హెచ్ఎం, అధికారులను ప్రశ్నించారు. పాఠశాలలో వివాహాలు, ఇతర ప్రైవేటు కార్యక్రమాలు నిర్వహించరాదని, స్టేజ్ ఇతర ఏర్పాట్లను సత్వరమే తొలగించాలని ఆర్డీవో షేక్ ఆయేషాను ఆదేశించారు. దీంతో వివాహ నిర్వాహకులు, స్థానిక నాయకులు కలెక్టర్‌ను కలిసి శుభకార్యాల నిర్వహణకు సదుపాయాలు లేక చాలాకాలంగా స్కూలు ఆవరణను వినియోగించుకుంటున్నామని వేడుకున్నారు. తొలుత ససేమిరా అన్న కలెక్టర్.. ఇకపై ఇటువంటి కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేస్తూ.. వివాహ నిర్వహణకు అనుమతించారు.

సైబర్ మోసం..

సరికొత్త రూపం

తలుపులు బద్దలు కొట్టాల్సిన పని లేదు. గోడలకు కన్నం వేయాల్సిన అవసరం లేదు. సీసీ ఫుటేజీ భయం లేదు. కాలు బయటపెట్టకుండానే కావల్సినంత దోచుకునే వెసులుబాటు.. కాస్త కంప్యూటర్ పరిజ్ఞానం, మాటలతో బురిడీ కొట్టించే నైపుణ్యమే పెట్టుబడి. ఇదే సైబర్ నేరగాళ్లకు అస్త్రాలు.




- ఏపీకే ఫైళ్లు పంపి మస్కా
- సమాచారం తస్కరణ
- నేరగాళ్ల చేతికి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు
- జిల్లాలో వెలుగుచూస్తున్న కొత్త కేసులు
- ఇటీవల కలెక్టర్ పేరుతో కూడా టోకరా
- అప్రమత్తత అవసరమంటున్న పోలీసులు


యలమంచిలి రూరల్: సైబర్ నేరగాళ్లు రోజుకో తరహాలో రెచ్చిపోతున్నారు. మొన్నటి వరకూ డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు చోరీ చేసి, ఖాతాదారుల ప్రమేయం లేకుండానే డబ్బులు కాజేసేవారు. పిన్ నంబర్ కొట్టేసి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు కాజేయడం, ఫోన్ సిమ్ కార్డును స్వాప్ చేసి మన ఫోన్‌కు అందాల్సిన సమాచారాన్ని వారు తీసుకుని డబ్బు కొల్లగొట్టేయడం చేసేవారు. ఈ నేరగాళ్లు ఇప్పుడు రూటు మార్చారు. సరికొత్త పంథాలో టెక్నాలజీని వాడుతూ లూటీకి పాల్పడుతున్నారు. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలతో మోసాలకు పాల్పడుతూ కష్టపడి సంపాదించుకున్న నగదును ఖాతాల్లో నుంచి ఖాళీ చేస్తున్నారు. తాజాగా ఎవరూ ఊహించని విధంగా ఫోన్లలో చొరబడుతున్నారు. ఏపీకే (ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ) ఫైళ్లను వాట్సాప్ ద్వారా పంపి, తద్వారా మొబైల్‌ఫోన్‌లో కావల్సిన సమాచారాన్ని తస్కరిస్తున్నారు. ఖాతాల నుంచి డబ్బు కాజేస్తున్నారు. విషయం తెలియక చాలామంది ఈ ఫైళ్లపై క్లిక్ చేస్తున్నారు. ఫలితంగా ఫోన్ హ్యాకై నియంత్రణ మొత్తం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళుతోంది. ఈ మోసాలపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో వీటి బారిన పడుతున్నారు. ఈ మధ్యకాలంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ తరహా నేరాలు నమోదవుతున్నాయి.

ఎస్‌బీఐ రివార్డు పాయింట్స్, యూబీఐ ఈకేవైసీ పేరుతో..

సైబర్ నేరస్తులు ఆధునిక సాంకేతికను ఉపయోగిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఫోన్ వినియోగదారులు మాల్వేర్‌ను చొప్పించేందుకు ఏపీకే ఫైళ్లను రూపొందిస్తున్నారు. కొరియర్, సెమినార్ ఆహ్వానం, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రివార్డ్ పాయింట్స్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈకేవైసీ అప్‌డేట్, ఫలానా గ్రూప్‌లో చేరేందుకు ఆహ్వానం వాట్సాప్‌ల ద్వారా పంపుతున్నారు. ఇలా పంపించిన ఏపీకే ఫైళ్లను క్లిక్ చేస్తే వివరాలు వస్తాయని నమ్మిస్తారు. ఇవి అత్యవసరం అని, తప్పనిసరి అని ఒత్తిడి తెచ్చి, డౌన్‌లోడ్ చేయిస్తారు. వీటిని ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల ఆ ఫోన్ హ్యాక్ అవ్వడమే గాకుండా దాని నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్తుంది. మొబైల్‌లోని వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్, నంబర్లు, ఎస్ఎంఎస్‌లు వంటివి అవతలి వ్యక్తులకు సులభంగా చేరతాయి. తద్వారా ఫోన్ నియంత్రణ పూర్తిగా హ్యాకర్ల చేతికి వెళ్తుంది. అందులోని సమాచారాన్ని మార్చడంతో పాటు, అదనంగా మాల్వేర్‌ను కూడా ఇన్‌స్టాల్ చేస్తారు. ఫోన్‌లోని బ్యాంకు ఖాతాలు, సోషల్‌మీడియా ప్రొఫైల్స్, కుటుంబ సమాచారం, వ్యక్తిగత మెయిల్స్ మోసగాళ్ల నియంత్రణలోకి పోతాయి. బ్యాంకు ఖాతాల నుంచి అనధికార లావాదేవీలు నిర్వహించి, నగదును తమ ఖాతాలకు బదిలీ చేస్తారు. ఆ వాట్సాప్ నుంచి అందులోని వివిధ గ్రూపుల వ్యక్తులకు కూడా ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేసుకోమని పంపిస్తారు. పొరపాటున వీటిని డౌన్‌లోడ్ చేస్తే ఖాతాలు లూటీ కావడం ఖాయం. ఇటీవల అనకాపల్లి జిల్లా కలెక్టర్ పేరుతో కూడా సైబర్ నేరగాళ్లు ఒక ఫోన్ నంబర్ నుంచి ఉన్నతాధికారులకు వాట్సాప్ సందేశాలు పంపారు. తాను అర్జంటు మీటింగ్‌లో ఉన్నానని, రూ.50 వేలు ఇస్తే, సాయంత్రానికి తిరిగి ఇచ్చేస్తానంటూ కలెక్టర్ పేరుతో ఒక బ్యాంక్ అకౌంట్, పాన్‌కార్డు నంబర్‌తో సహా మెసేజ్ పంపారు. కొందరు అధికారులకు అనుమానం వచ్చి, ఆరా తీసి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఎస్‌బీఐ రివార్డ్ పాయింట్స్ పేరుతో వాట్సాప్‌లో షేర్ చేస్తున్న ఏపీకే ఫైల్



యుబీఐ ఈకేవైసీ పేరుతో సైబర్ నేరగాళ్లు పంపుతున్న ఏపీకే ఫైల్

అప్రమత్తంగా ఉండడమే మార్గం



సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా ఉండాలంటే చాలా అప్రమత్తంగా వుండాలి. ఏపీకే ఫైళ్లు ఓపెన్ చేయకూడదు. అపరిచిత వ్యక్తులు పంపే మెసేజ్‌లకు రెస్పాండ్ కాకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతాలు, ఆధార్ నంబర్ చెప్పకూడదు. బ్యాంకు అధికారులు, పోలీసులమని చెప్పినా నమ్మకూడదు. సైబర్ మోసాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. కొత్త కొత్త రూపాల్లో సైబర్ నేరగాళ్లు టెక్నాలజీని వాడుకుని ప్రజల సొమ్మును దోచేస్తున్నారు.

–కె.వి.సత్యనారాయణ, పరవాడ డీఎస్పీ

క్లుప్తంగా

గండి బాబ్జీ నుంచి మా స్థలాల్ని కాపాడండి

- ఈ.మర్రిపాలెం లే అవుట్ వద్ద బాధితుల ఆందోళన



లేఅవుట్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

పరవాడ: ఈ.మర్రిపాలెంలో తాము కొనుగోలు చేసుకున్న ఇళ్ల స్థలాలను టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఆక్రమణల నుంచి కాపాడాలని కోరుతూ బాధితులు సదరు ప్రైవేట్ లేఅవుట్ వద్ద బుధవారం ఆందోళన దిగారు. బాబ్జీకి వ్యతిరేకంగా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఆందోళన కార్యక్రమంలో బాధితుడుసాంబశివరావు మాట్లాడుతూ ఈ.మర్రిపాలెం రెవెన్యూ పరిధిలో 2012లో సర్వే నెం.15, 16/1లో రెండు విడతలుగా ఐదెకరాల స్థలాన్ని కొనుగోలు చేసి లేఅవుట్ వేశామన్నారు. అన్ని రకాల ఫీజులు చెల్లించి సదరు స్థలాన్ని 80 మందికి విక్రయించినట్లు పేర్కొన్నారు. పది రోజుల క్రితం టీడీపీ నేత గండి బాబ్జీకి చెందిన అనుచరులు కొంత మంది తమ లేఅవుట్‌లోకి అక్రమంగా చొరబడి, రాతి గోడను ధ్వంసం చేసి, దౌర్జన్యంగా ఫెన్సింగ్ వేసి కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు కల్పించుకుని టీడీపీ నేత బాబ్జీ అనుచర వర్గం నుంచి తమస్థలాలను కాపాడాలని కోరారు. ఈకార్యక్రమంలో బాధితులు కృష్ణప్రసాద్, వెంకటపతిరాజు, సీత, కృష్ణారావు, పెదిరెడ్ల అప్పారావు, నాగరత్నం, ధనలక్ష్మి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

మందకొడిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

- ఇప్పటి వరకు 1500 దరఖాస్తులు..
- నవంబర్ 6 తుది గడువు

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు మందకొడిగా సాగుతోంది. ఇప్పటి వరకు 1500 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ప్రస్తుత ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29తో పూర్తి అవుతుంది. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పాత ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకోనందున గత నెల 30న కొత్త నోటిఫికేషన్ జారీ చేశారు. నవంబర్ 6 వరకు దరఖాస్తులు స్వీకరించి, అదే నెల 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల చేస్తారు. డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి, ఆ నెల 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. సాధారణంగా ఉపాధ్యాయ సంఘాలు ఈ ఓటర్ల జాబితా నమోదులో ఉత్సాహం చూపుతాయి. ఈసారి వరుస సెలవులు, పండగలు, వర్షాల కారణంగా నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత వచ్చాక నమోదు ప్రక్రియ ఊపందుకునే అవకాశాలున్నాయి.

మద్యం దందా షురూ!

- తెరుచుకుంటున్న ప్రైవేట్ వైన్ షాపులు
- లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వారికి చుక్కలు
- షాపులు దొరక్కుండా ఇబ్బందులు పెడుతున్న కూటమి నేతలు
- మద్యం స్టాకు విడుదల చేసుకున్నది కేవలం 94 మందే..
- వాటాల కోసం పలువురిపై ఒత్తిళ్లు
- నివాస ప్రాంతాల్లో లిక్కర్ షాపులపై ఫిర్యాదులు



రైల్వే న్యూకాలనీలో కొత్తగా ఏర్పాటైన వైన్‌షాప్

విశాఖ సిటీ: కూటమి నేతల దౌర్జన్యానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. లాటరీలో వైన్‌షాపులు దక్కించుకున్న కొంత మందికి చుక్కలు చూపిస్తున్నారు. స్వతంత్రంగా మద్యం వ్యాపారం చేయాలనుకుంటున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. లీజులకు షాపులు దొరక్కుండా అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అప్పుడే కమీషన్ల కోసం ఒత్తిడి చేస్తున్నట్లు కొంత మంది వ్యాపారులు వాపోతున్నారు. లాటరీ ప్రక్రియ పూర్తయి రెండు రోజులైనా ఇంకా కొందరు షాపుల వేటలోనే ఉన్నారు. ఫలితంగా వారు మద్యం స్టాకును విడిపించుకోలేదు.

155 షాపులకు ప్రొవిజనల్ లైసెన్సులు

విశాఖ జిల్లాకు 155 వైన్ షాపులను కేటాయించారు. వీటికి ఈ నెల 14న లాటరీ నిర్వహించారు. షాపులు దక్కించుకున్న వారందరూ లైసెన్స్ ఫీజులో 1/6 రుసుం చెల్లించారు. దీంతో ఎక్సైజ్ అధికారులు వారికి ప్రొవిజనల్ లైసెన్సులు మంజూరు చేశారు. అయితే బుధవారం సాయంత్రం వరకు 94 మంది మాత్రమే మద్యం స్టాక్ విడిపించుకున్నారు. మిగిలిన వారు షాపుల వెతుకులాటలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. వారం రోజులకే ప్రొవిజినల్ లైసెన్సులు ఇవ్వడంతో.. ఈ లోగా షాపులు ఏర్పాటు చేసుకుని అధికారంగా వైన్‌షాపులు నిర్వహించుకోవాల్సి ఉంటుంది. వారం రోజుల తర్వాత సంబంధిత ఎక్సైజ్ స్టేషన్ సీఐలు స్వయంగా షాపులు పరిశీలించనున్నారు.

కమీషన్ల కోసం ఒత్తిళ్లు

జిల్లాలో 155 మద్యం దుకాణాల్లో 120కి పైగా సిండికేట్ల చేతుల్లోనే ఉన్నాయి. ఒక్కో షాపునకు 3 నుంచి 10 దరఖాస్తులు వేయడంతో లాటరీలో వారికే అత్యధిక షాపులు దక్కాయి. కాగా.. స్వతంత్రంగా మద్యం వ్యాపారం చేయాలని దరఖాస్తు చేసుకుని లాటరీలో వైన్‌షాప్‌ను దక్కించుకున్న వారి ఆనందం ఆవిరయ్యేలా కూటమి ప్రజాప్రతినిధుల అనుచరులు రంగంలోకి దిగారు. వైన్‌షాప్ ప్రారంభించక ముందే ఆయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు అప్పుడే గెద్దల్లా వాలిపోతున్నారు. కమీషన్ల కోసం ఒత్తిళ్లు చేస్తున్నారు. తాము చెప్పినట్లు చేయని పక్షంలో షాపులు దొరక్కుండా చేస్తామని పలువురిని బెదిరించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు నడిచిన షాపులను ఇప్పటికే సిండికేట్లు తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. కొందరు ఎక్సైజ్ అధికారుల సహాయ, సహకారాలతో లాటరీకి ముందే లీజులు చేయించేసుకున్నారు. దీంతో కొత్త వారికి ఆయా దుకాణాలు దొరికే అవకాశం లేకుండా పోయింది.

కలెక్టర్‌కు ఫిర్యాదులు

జిల్లాలో సగం కూడా మద్యం దుకాణాలు ఏర్పాటు కాలేదు. ప్రారంభమైన కొన్ని వైన్ షాపులపై అప్పుడే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారంటూ ఒకవైపు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో పాటు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఓల్డ్ సీబీఐ జంక్షన్‌లో రెసిడెన్షియల్ ప్రాంతంలో వైన్‌షాప్ ఏర్పాటు చేస్తున్నారంటూ స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. ఎక్సైజ్ అధికారులతో విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే 8వ వార్డు పరిధి సుభాష్‌నగర్, మిథిలాపురి వుడా కాలనీ సమీపంలోని వికలాంగుల కాలనీలో మద్యం షాపులు వద్దని స్థానికులు ఆందోళన చేపట్టారు. ఈ ఫిర్యాదులపై త్వరలోనే విచారిస్తామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఉంటే షాపుల ఏర్పాటుకు అనుమతి స్తామని పేర్కొంటున్నారు.

ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలి





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- శాంతియుత ర్యాలీని విజయవంతం చేయండి

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో బుధవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గబ్బాడ డిపోలో ఉన్న 48వేల మెట్రిక్ టన్నుల ఇసుకను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తామంటే ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే, వారి ఆశలపై నీళ్లు చల్లారని విమర్శించారు. నియోజకవర్గంలో భవన నిర్మాణరంగంపై ఆధారపడి జీవిస్తున్న ఐదు వేల మంది కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని తెలిపారు. మీ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ఇసుక ఉన్న ఉచితంగా తీసుకువెళ్లవచ్చని సీఎం చంద్రబాబు చెబుతుంటే అధికారులు మాత్రం కేసులు పెడుతున్నారని ఆరోపించారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలకు వస్తే ప్రస్తుతం రూ.10వేల నుంచి రూ.12 వేలకు లభిస్తోందని చెప్పారు. విచారణ పేరుతో డిపోలో ఇసుకను వంద రోజుల నుంచి పంపిణీ చేయలేదన్నారు. ఇప్పుడు విచారణ పూర్తయినందున డిపోలో ఇసుకను ఉచితంగా పంపిణీ చేసేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇసుక కొరతతో నిర్మాణదారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పోకడతో ఇబ్బంది పడుతున్న కార్మికుల తరఫున ఈ నెల 21న చేపడుతున్న నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కార్మికులు, పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు రుత్తల ఎర్రాపాత్రుడు, పార్టీ వైద్య విభాగం నాయకులు డాక్టర్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

- మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు

కోటవురట్ల: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారి తరఫున పోరాటాలు చేయడానికి అంతా సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు తెలిపారు. మండల కేంద్రం కోటవురట్లలోని ఆయన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, మద్దతు సర్పంచులు, నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేసి కూటమి నాయకులు గద్దెనెక్కారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి వందరోజులు దాటినా ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈపాటికే అమ్మ ఒడి, మత్స్యకార భరోసా, రైతు భరోసా నిధులు జమ అయ్యేవన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఫ్రీ బస్ పథకం అమలు చేస్తామని చేతులెత్తేశారని విమర్శించారు. దసరా నుంచి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఊదరగొట్టారని, దసరా వెళ్లి పోయినా ఆ హామీపై కూటమి నాయకులు పెదవి విప్పడం లేదని తెలిపారు. ప్రజలను ఏదో రకంగా తప్పుదోవ పట్టించి పబ్బం గడుపుకోవడమే చంద్రబాబు నైజమన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని, అధికారులను నిలదీయాలని అవసరమైతే న్యాయపరంగా పోరాటం చేద్దామన్నారు. ప్రజలను చైతన్యపరిచి వారి తరఫున పోరాటం చేసేందుకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయండి

- స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, చిత్రంలో సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట(విశాఖ): ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగాయి. గ్రామీణాభివృద్ధి, జల వనరులు, గనులు, ప్రజా రవాణా, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించలేదని.. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొత్త గృహాలు మంజూరు కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న గృహ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం కూడా జరుగుతుందని అధికారులు వివరించారు. గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులపై ఆరా తీసిన ఆమె జెడ్పీటీసీలకు సమాచారం ఇవ్వాలన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కార్యక్రమంపై దృష్టి సారించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. అలాగే జల్ జీవన్ మిషన్ ద్వారా పెండింగ్ కనెక్షన్లు, కొన్ని ప్రాంతాల్లోని ఇతర సమస్యలపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి లేవనెత్తిన ప్రశ్నకు బదులిస్తూ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ వివిధ రూట్లలో నిలుపుదల చేసిన బస్సులను పునఃప్రారంభించాలని ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన దాదాపు 95 శాతం వరకు పింఛన్లు పంపిణీ జరుగుతోందని, అందుబాటులో లేని వారికి మరుసటి రోజున అందజేస్తున్నామన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లకు ప్రతిపాదనలు ఇవ్వండి

గ్రామాల్లో రోడ్ల మరమ్మత్తులు, కొత్త రోడ్ల కోసం ప్రతిపాదనలు ఇవ్వాలని జెడ్పీ సీఈవో నారాయణ మూర్తి కోరారు. మండల స్థాయిలో రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు, జిల్లా స్థాయిలో రోడ్ల కోసం జెడ్పీ నిధుల నుంచి ఖర్చు చేస్తామన్నారు. కోరం లేని కారణంగా నాల్గవ స్థాయీ సంఘం సమావేశం వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి ఏఐపై సదస్సు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 18, 19 తేదీల్లో వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషీన్ లెర్నింగ్(ఎంఎల్), డేటా సైన్స్(డీఎస్)పై తెలుగులో చర్చా వేదికను నిర్వహిస్తున్నట్లు సదస్సు సహ సమన్వయకర్త ఆచార్య ఎం.రాంజీ తెలిపారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల, ఐటీసీఏ విభాగాల ఆధ్వర్యంలో ఏపీసీటీఈ సహకారంతో నిర్వహించే ఈ సదస్సును ఏయూ వీసీ శశిభూషణరావు ప్రారంభిస్తారన్నారు. ఈ చర్చా వేదికలో నిపుణుల ప్రసంగాలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటాయని వివరించారు.

అన్ని సమస్యలు పరిష్కరించాకే..

- సరిహద్దులో నేవల్ బేస్ గోడ నిర్మాణం
- ఆర్డీవోకు స్పష్టం చేసిన మత్స్యకారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెంలో నేవల్ బేస్ నిర్వాసితులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశాకే.. సరిహద్దులో గోడ నిర్మాణం చేపట్టాలని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.వి.రమణకు మత్స్యకారులు స్పష్టం చేశారు. బుధవారం బంగారమ్మపాలెం పర్యటనకు వచ్చిన ఆర్డీవోతో మత్స్యకార గ్రామ పెద్దలు సమావేశం అయ్యారు. నేవల్ బేస్ సరిహద్దుల్లో త్వరలో గోడ నిర్మాణం చేపడతామని చెప్పడంతో వారు వ్యతిరేకించారు. నిత్యం సముద్రంలో చేపలు పట్టుకుని బతికే తమకు ప్రత్యామ్నాయం చూపకుండా గోడ నిర్మిస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఇంకా చాలా సమస్యలు పరిష్కరించాల్సి ఉందని, ఇప్పుడు గోడ నిర్మాణం చేస్తే తాము ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. మత్స్యకారుల ఆవేదన విన్న ఆర్డీవో వివరాలు నమోదు చేసుకుని కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీలు సీహెచ్ కోదండ, మైలపల్లి రాజారావు, గ్రామ పెద్దలు, నక్కపల్లి సీఐ కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

'అగమ్య షిప్ ఫైర్ ఫైటింగ్ ట్రైనింగ్ ఫెసిలిటీ' ప్రారంభం

సింధియా: ఐఎన్ఎస్ విశ్వకర్మలో అత్యాధునిక సదుపాయాలతో దేశీయంగా రూపొందించిన 'అగమ్య' షిప్ ఫైర్ ఫైటింగ్ ట్రైనింగ్ ఫెసిలిటీ అందుబాటులోకి వచ్చింది. దీనిని బుధవారం వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా అందుబాటులోకి వచ్చిన కొత్త సదుపాయాలతో భారత నౌకాదళం అంతర్జాతీయ స్థాయిలో తన సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంది.

టగ్ నిర్మాణానికి హెచ్ఎస్ఎల్‌తో వీపీటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న పోర్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ శ్రీనివాస్, హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ కమాండర్ గిరిదీప్ సింగ్

విశాఖ సిటీ: విశాఖ పోర్టు అథారిటీ అవసరాలకు తగ్గట్టుగా బొల్లార్డ్ పుల్ టగ్ నిర్మించేందుకు హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్ఎస్ఎల్) సిద్ధమైంది. ఇందుకు సంబంధించి పోర్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ టి.శ్రీనివాస్, హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ కమాండర్ గిరిదీప్ సింగ్ బుధవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశా రు. ఈ ఒప్పందంలో భాగంగా 60 టన్నుల సామర్థ్యం కలిగిన బొల్లార్డ్ పుల్ టగ్‌ను హెచ్ఎస్ఎల్ 18 నెలల్లో నిర్మించి పోర్టుకు అందించనుంది. అత్యాధునిక సాంకేతికతతో, భద్రతా ప్రమాణాలతో నిర్మించనున్న ఈ టగ్.. పోర్టు హార్బర్‌లో నౌకల కదలికలను సులభతరం చేయడంలో కీలక పాత్ర పోషించనుంది. అలాగే రానున్న రోజుల్లో కార్గో ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచడంలోను సహాయపడనుంది.

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

అనకాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఇవ్వనున్న ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగించినట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. టెట్ అర్హత కలిగిన విద్యార్థులు శిక్షణకు అర్హులని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27న పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు https://jananabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని ఆమె కోరారు.

ఐటీఐని సందర్శించిన డైరెక్టర్ జనరల్

కంచరపాలెం(విశాఖ): కంచరపాలెం పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని డైరెక్టర్ జనరల్(ట్రైనింగ్), స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ అడిషనల్ కార్యదర్శి త్రిషలై జిట్ శెటి బుధవారం సందర్శించారు. ఆడియో రియాల్టీ(ఏఆర్), విజువల్ రియాల్టీ(వీఆర్)లో శిక్షణ పొందుతున్న వారి వివరాలను ఇక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఐటీఐలో ప్రతీ ల్యాబ్‌ను పరిశీలించిన ఆమె.. స్కిల్ ఇండియా అప్‌గ్రేడేషన్‌పై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ల్యాబ్‌ల్లో నూతన పరికరాలు, యంత్రాలను ఆమె ప్రారంభించారు. రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ, ఐఎంసీ చైర్మన్ బి.ఎస్.బి.ప్రభాకర్‌రావు, ఐటీఐ వైస్ ప్రిన్సిపాల్ వై.ఉమాశంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్.శ్రీనివాస్(32) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడినట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. నర్సీపట్నానికి చెందిన శ్రీనివాస్ ఈ నెల 13న బైక్‌పై విశాఖపట్నం వైపు వెళ్తుండగా నర్సీపట్నం వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్‌కు ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి చాకలి వీధిలో నివాసం ఉంటున్న జి.రవికుమార్(28) అనే యువకుడు బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య కొంత కాలంగా పుట్టింటి వద్ద ఉంటోంది. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు. మృతుడి తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



19న ఖోఖో ఎంపిక పోటీలు

అనకాపల్లి: చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈనెల 25,26,27 తేదీల్లో జరగనున్న అంతర్‌జిల్లాల ఖోఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా జట్టును ఈనెల 19న ఎంపిక చేయనున్నట్టు ఉమ్మడి విశాఖ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి జయవీర్, సీహెచ్.ఎల్.ఎం శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు అనకాపల్లి మండలం తుమ్మపాలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 నవంబర్ 21న తరువాత జన్మించి ఉండాలని, మరిన్ని వివరాలకు 8309960421 అనే నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో మహిళా కానిస్టేబుల్ ప్రతిభ



కాంస్య పతకం సాధించిన మహిళా కానిస్టేబుల్ నిర్మలను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం పోలీసు స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ముడిల నిర్మల జాతీయ స్థాయి యోగా ఛాంపియన్ షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే విజయకుమార్ తన కార్యాలయంలో నిర్మలను ఘనంగా సత్కరించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయిలో సెప్టెంబర్ 23 నుంచి 27 వరకు జరిగిన పోటీల్లో నిర్మల పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యే విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి పతకాలు సాధించాలని విజయకుమార్ ఆకాంక్షించారు.

హోరాహోరీగా ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో పడాల్‌దాస్

- రాష్ట్ర స్థాయి అండర్-14, 17 విభాగాలకు 46 మంది ఎంపిక



పోటీలో ఉత్సాహంగా ఆడుతున్న క్రీడాకారుడు

దేవరాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా పోటీలు దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం హోరా హోరీగా జరిగాయి. ఈ పోటీలను స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మండల విద్యాశాఖాధికారి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా 34 పాఠశాలల నుంచి 140 మంది పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన 46 మందిని రాష్ట్ర స్థాయి అండర్-14, అండర్-17 సెపక్‌తక్రా, ఫుట్‌బాల్ పోటీలకు సెల్క్షన్ కమిటీ ఎంపిక చేసినట్టు మండల విద్యాశాఖ అధికారి బి.పడాల్‌దాస్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్-14, అండర్-17 విభాగాలలో ఫుట్‌బాల్ పోటీలకు 18 మంది బాలురు, 18 మంది బాలికలు ఎంపికయ్యారు. సెపక్‌తక్రా అండర్-14, అండర్-17 విభాగాల్లో ఐదుగురు చొప్పున ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎంఈవో బి.పడాల్‌దాస్, జిల్లా క్రీడా పరిశీలకుడు ఎం.ఎం.మనోహర్, వ్యాయామ ఉపాధ్యాయుడు బాబూరావు తదితరులు అభినందించారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



విజేతలతో జెడ్పీటీసీ సుకల రమణమ్మ



నర్సీపట్నం: మండలంలోని వేములపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి అండర్-14 కబడ్డీ ఎంపిక పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లాలోని పాఠశాలల నుంచి 350 మంది బాల, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగంలో గాజువాక నియోజకవర్గం టీమ్ ప్రథమ స్థానంలో నిలవగా, నర్సీపట్నం నియోజకవర్గం జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో అరకు వ్యాలీ నియోజకవర్గం ప్రథమస్థానం, చోడవరం నియోజకవర్గం జట్టు ద్వితీయస్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు పోటీల ఆర్గనైజర్ పీడీ రవి తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన జెడ్పీటీసీ సుకల రమణమ్మ విజయం సాధించిన టీమ్‌లను అభినందించారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్.తలుపులు, హెచ్‌ఎం జి.రమణ, స్కూల్ కమిటీ చైర్మన్ జి.వేమాల తల్లి, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ పోటీల పర్యవేక్షకులుగా జిల్లాలోని 80 మంది వ్యాయామ ఉపాధ్యాయులు వ్యవహరించారు.

క్లుప్తంగా

'డిస్లెక్సియా' పిల్లలకు ప్రత్యేక శిక్షణ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాక భవితా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయురాలు వై.ఏసురత్నం మాట్లాడుతూ జన్యుకారణాలతో డిస్లెక్సియా వ్యాధితో కొంత మంది విద్యార్థులు బాధపడుతున్నారన్నారు. చదివే విషయంలో సమస్యలు ఉండటాన్ని డిస్లెక్సియా అంటారని అవగాహన కల్పించారు. అటువంటి వారిని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.రమాదేవి, భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

కశింకోట: మండలంలో ఈ నెల 17వ తేదీ గురువారం నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. గతంలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సభలు ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని 27 రెవెన్యూ గ్రామాలుండగా.. వాటిలో 25 గ్రామాల్లో రీసర్వే పూర్తి అయిందన్నారు. రీ సర్వేలో తేడా వల్ల భూమి నష్టపోయిన రైతులు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను రెవెన్యూ గ్రామసభల్లో పరిష్కరిస్తామని చెప్పారు. కొత్తపల్లిలో సభలు ప్రారంభిస్తామన్నారు. వచ్చే నెల 8 వరకు గ్రామాల వారీగా షెడ్యూల్ మేరకు సభలు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకొని, సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అనకాపల్లి: విద్యుత్ శాఖ డీ–1 సెక్షన్ పరిధిలో విద్యుత్ వైర్ల కింద జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఈ నెల 18వ తేదీ శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీ–1 ఫీడర్ పరిధిలోని గుండాల వీధి, లక్ష్మీదేవిపేట, గాంధీనగరం, అంజయ్య కాలనీ, విజయరామరాజుపేట, ఏఎంసీ కాలనీ, శ్రీరామ్ నగర్, లక్ష్మీనారాయణనగర్ ఫీడర్ పరిధిలోని రైల్వే స్టేషన్ రహదారి, రింగ్ రోడ్డు, తాకాశి వీధి, మళ్ల వీధి, గాంధీబొమ్మ జంక్షన్, చిన్న వీధి, పెరుగుబజార్ జంక్షన్ వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 245 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,120	5,300
రెండో రకం	3,600	4,600
మూడోరకం	3,300	3,500

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
విశ్వం	:సత్యనారాయణ స్క్రీన్-1
శ్వాగ్	:సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	:పర్తిసాయి
వేట్టయాన్	:షిర్డీసాయి
జిగ్రా	:వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	: శ్రీసత్య
మార్టిన్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-30 యూనిట్లు, ఓ పాజిటివ్-21 యూనిట్లు, ఏబీ పాటిజివ్-4 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 346 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 318 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఎరువు సరఫరాలో కోత..

అన్నదాత వ్యథ

మండలంలోని రైతులకు ప్రభుత్వం యూరియా ఎరువు అరకొరగా సరఫరా చేస్తోంది. దీంతో ప్రధానంగా వరి సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటకు అవసరమైన సమయంలో ఎరువు అందించకపోవడం వల్ల పంట ఎదుగుదల లోపించి నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్తే ఇతర ఎరువు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని నిబంధన పెడుతున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోక రైతులు సతమతమవుతున్నారు.



కశింకోటలో వరి సాగు

కశింకోట: మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అత్యధికంగా ఖరీఫ్ వరి 1360 హెక్టార్లలో వేశారు. వాటి ఎదుగుదల, పంట ఈని గింజ కట్టి చేతికి రావడానికి ఇతర ఎరువులతో పాటు యూరియా ఎరువు వాడాల్సి ఉంటుంది. అధికారిక లెక్కల ప్రకారం ఎకరాకు 75 కిలోల యూరియా ఎరువు అవసరం అవుతుంది. దీన్ని మూడు దఫాలు వేయాల్సి ఉంటుంది. మండలంలో 15 రైతు సేవా కేంద్రాలు, రెండు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, కశింకోట, తాళ్లపాలెంలలో చెరొక ప్రైవేటు డీలర్ల ద్వారా యూరియాను ప్రభుత్వం రైతులకు సరఫరా చేస్తోంది. బస్తా ఎరువును రూ.270కి అందిస్తున్నారు. దీనిని పంట విస్తీర్ణానికి అవసరమైన మేరకు అందివ్వకుండా అరకొరగా అందించి చేతులు దులుపుకుంటున్నారని రైతులు విమర్శిస్తున్నారు. ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్లినా యూరియా లభ్యం కావడం లేదంటున్నారు. యూరియా కొనుగోలు చేయాలంటే సుమారు రూ.1500 ఖరీదు ఉన్న పొటాష్ ఎరువు గాని, రూ.500 నుంచి వెయ్యి వరకు ఉన్న గుళికలు గాని కొనుగోలు చేయాలని కండీషన్ పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇంత ఖరీదు పెట్టి ఎలా కొనుగోలు చేయగలమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అటువంటి నిబంధన లేదని అధికారులంటున్నారు. పంటకు కావలసిన యూరియా ఎరువు మాత్రం సరిపడనంత మేర అందకపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇక గతంలో రైతు భరోసా కేంద్రాలన్నింటి లోను యూరియా అందుబాటులో ఉండేది. ఏఎస్ పేట, జమాదులపాలెం, తీడ కేంద్రాల్లో గిడ్డంగి సదుపాయం అందుబాటులో లేకపోవడం, కన్నూరుపాలెం కేంద్రం వ్యవసాయ సహాయకుడు ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోవడం వంటి కారణాల వల్ల అక్కడ రైతులకు యూరియా అందుబాటులో లేదు. దీంతో సుదూర ప్రాంతాలకు వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లి యూరియా కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆయా ప్రాంత రైతులు వాపోతున్నారు. యూరియా కొరతతో ఎదుగుదల లేక పంట చేతికి రావడం కష్టంగా పరిణమించనుందని వాపోతున్నారు. దీని దృష్ట్యా యూరియాను సరిపడినంత మేర నిర్ణీత ధరకు సరఫరా చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సరిపడినంత ఎరువు అందజేయాలి



ఎకరం భూమిలో వరి పంట వేశాను. 50 కిలోల వంతున మూడు బస్తాల మేర యూరియా ఎరువు అవసరం ఉంది. అయితే ఒక బస్తా మాత్రమే సరఫరా చేశారు. మిగిలిన ఎరువు లభ్యం కావడం లేదు. ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్తే రూ.1500 ఖరీదు ఉన్న పొటాష్‌గాని, రూ.500 పైబడి ఖరీదు ఉన్న గుళికలు గాని తీసుకోవాలని లింకు కండిషన్ పెడుతున్నారు. అంత ఖరీదు పెట్టి చిన్నకారు రైతులు ఎలా కొనుగోలు చేయగలరు? దీంతో వేసిన పంట ఎలా పండించాలో తెలియక సతమతం కావాల్సి వస్తోంది. సకాలంలో ఎరువు అందివ్వకపోతే పంట దెబ్బతిని నష్టపోక తప్పదు.

– బుద్ద వెంకటరావు, వరి రైతు, కశింకోట

నిబంధనలతో ఇక్కట్లు



రెండు ఎకరాల్లో వరి పంట వేశాను. నాలుగు బస్తాల యూరియా ఎరువు అవసరం. అయితే రెండు బస్తాలు మాత్రమే అందించారు. ఇంకా వేయాల్సి ఉన్న ఎరువు కోసం కాళ్లు అరిగేలా తిరగాల్సి వస్తోంది. పంటకు వేయడానికి సరిపడినంత మేర యూరియా సరఫరా చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎరువు సరఫరాకు పెడుతున్న నిబంధనల వల్ల చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి. ఎలాంటి నిబంధనలు లేకుండా రైతులందరికీ కావలసిన మేర ఎరువు అందజేసి సాగుకు సహకరించాలి.

– ఆళ్ల జగన్నాథరావు, రైతు, వెదురుపర్తి

చర్యలు తీసుకున్నాం

యూరియా ఎరువును సరిపడినంత మేర సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నాం. 15 రైతు సేవా కేంద్రాలు, రెండు పీఏసీఎస్‌లు, రెండు ప్రైవేట్ దుకాణాల ద్వారా యూరియా బస్తా రూ.270కి సరఫరా చేస్తున్నాం. యూరియా ఎరువుతో ఇతర ఎరువులు కొనుగోలు చేయాలనే కండిషన్ లేదు. ఈ విషయమై ప్రైవేటు డీలర్లకు ఆదేశాలిచ్చాం. రైతులు మోతాదుకు మించి యూరియా ఎరువును కొనుగోలు చేస్తుండటం, ఒకేసారి సరిపడినంత ఎరువు కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోవడం తదితర కారణాల వల్ల యూరియా నిల్వలు తగ్గిపోతున్నాయి. ఎకరా వరి పండించడానికి 75 కిలోల యూరియా మాత్రం వేస్తే సరిపోతుంది. అంతకు మించి రైతులు వాడుతున్నారు. అతిగా వినియోగించడం పంటకు ఉపయోగకరం కాదు.

– ఎం. స్వప్న, మండల వ్యవసాయాధికారి, కశింకోట

వరిలో తెగుళ్ల నివారణపై దృష్టి



కుంచంగిలో రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి రంగాచారి

అనకాపల్లి: వరి పొలంలో తెగుళ్లు, పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని, వాటి నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కూండ్రం, కుంచంగి గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఎంటీయూ–1075 ఆకు ముడత, పొడ తెగులును పరిశీలించామన్నారు. వాటి నివారణకు రెండు మిల్లీలీటర్ల హెక్సా కొనజోల్ మందును లీటర్ నీటికి, ఎసిఫేట్ 1.5 గ్రామ్స్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. బీపీటీ–5204 ఆకు ముడత నివారణకు క్లోరిఫైరిఫాస్ లీటర్ నీటికి 2 మి.లీ. చొప్పున స్ప్రే చేయాలని, ఈ రకంలో దోమ ఉధృతికి గాను లీటర్ నీటికి 1.5 గ్రా. ఎసిపెట్ వేయాలన్నారు. వరిలో ఎకరానికి 25 కేజీల యూరియా, 15 కేజీల పోటాస్ వేయాల్సి ఉందన్నారు. బ్యాక్టీరియా ఎండు తెగుళ్ల(పండాకు) నివారణకు ప్లాంటోమైసిన్ 100 గ్రాములు, పోటాస్ అందుబాటులో లేని కారణంగా 13–0–45 ఎకారానికి ఒక కేజీ చొప్పున పురుగు మందులతో కలిపి పిచికారీ చేయాలని రంగాచారి సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందవరపు లక్ష్మీసూరిబాబు, ఎంపీటీసీ జెట్టి నాగమణి, రైతులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు వేయించాలి



కె.కోటపాడులో నట్టల నివారణ మందును వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఏడీ దినేష్‌కుమార్

కె.కోటపాడు : గొర్రెలు, మేకల పెంపకందారులు తప్పనిసరిగా ఏడాదికి మూడుసార్లు నట్టల నివారణ మందును వేయించాలని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేస్‌కుమార్ తెలిపారు. కె.కోటపాడు, గొండుపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పశుసంవర్ధకశాఖ ద్వారా నట్టల నివారణ మందును వేసే కార్యక్రమం ఈ నెల 31 వరకూ జరగనున్నట్టు తెలిపారు. కె.కోటపాడు మండలంలో 17 వేలు, దేవరాపల్లి మండలంలో 16500 గొర్రెలు,మేకలకు నట్టల నివారణ మందు లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

చీడికాడ: మండలంలో వరాహపురం, ఖండివరం, తురువోలు గ్రామాల్లో 420 గొర్రెలు, 830 మేకలకు బుధవారం ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్టు మాడుగుల ఏరియా పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు తమ రైతు సేవా కేంద్రాల్లో గాని, పశువైద్య శాలల్లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న నట్టల నివారణ కార్యక్రమాన్ని పరిశీలించారు.

హామీలు నెరవేర్చాలని వినతి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న యర్రాపాత్రుడు, భూనిర్వాసితులు

నర్సీపట్నం: మాకవరపాలెం పయనీర్ కంపెనీ యాజమాన్యం భూనిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని భూ నిర్వాసితులు, చేతివృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ నిర్వాసితులతో కలిసి యర్రాపాత్రుడు ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణకు బుధవారం వినతి పత్రం అందజేశారు. భూసేకరణ చేసిన సమయం నుంచి నేటి వరకు జరిగిన ఆరాచకాలపై బహిరంగ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూసేకరణ సమయంలో ప్రతి ఇంటికి కంపెనీలో ఉద్యోగం, రెండు సెంట్ల భూమి, ఉపాధి నిమిత్తం పాడి పశువులు, ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు ఇస్తామని కంపెనీ వారు రైతులకు హామీ ఇచ్చారన్నారు. నిర్వాసితులు, పునరావాసులకు ఇంత వరకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోగా తాటి ఆకు ఇళ్లలో ఉన్న మాకిరెడ్డి వరహాలమ్మ ఇంటిపై కంపెనీ సిబ్బందితో దాడి చేయించారని ఆరోపించారు. దాడిపై పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని, తిరిగి బాధితులపైనే కేసులు బనాయిస్తున్నారని అన్నారు. భూ నిర్వాసితుల అవసరాల మేరకు ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ భూమిని అనర్హులైన బినామీ పేర్లతో అక్రమ పట్టాలు ఇచ్చి సొమ్ము చేసుకున్నారన్నారు. రైతులకు నష్ట పరిహారాలు, ప్యాకేజీలు రాకుండా అరాచకాలకు పాల్పడిన కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏవోను కలిసిన వారిలో ఎం.అప్పలనాయుడు, సిహెచ్.రాజుబాబు, మాకిరెడ్డి నూకరాజు, ఎస్.లోవరాజు, ఎం.సత్తిబాబు ఉన్నారు.

జీతాలు పెంచాలని కోరుతూ లారీ డ్రైవర్ల ఆందోళన

కశింకోట: మండలంలోని బయ్యవరంలో ఉన్న సిమెంట్ పరిశ్రమ వద్ద సీఐటీయూఆధ్వర్యంలో బుధవారం వరుసగా మూడో రోజు తమ జీతాలు పెంచాలని కోరుతూ లారీ డ్రైవర్లు సమ్మె నిర్వహించి నిరసన తెలిపారు. గత ఏడేళ్లుగా జీతాలు పెంచకపోవడం శోచనీయమన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు, కమిటీ సభ్యుడు దాకారపు శ్రీనివాసరావు, డ్రైవర్స్ యూనియన్ నాయకులు గోవింద్, మణిబాబు, అప్పలనాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఉత్సవం నేడు



కశింకోటలో మరిడిమాంబ

కశింకోట: కశింకోటలో గురువారం మరిడిమాంబ ఉత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కనకమహాలక్ష్మి వీధి, కస్పావీధుల్లో ఉన్న అమ్మవారి ఆలయాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

సస్యరక్షణకు సూచనలు పాటించాలి



రోలుగుంటలో తెగుళ్లు సోకిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి విజయలక్ష్మి

రోలుగుంట: పంటలకు సోకిన తెగుళ్ల నివరాణ కోసం సస్యరక్షణ కోసం వ్యవసాయాధికారుల సూచనలు తీసుకొని పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి తెలిపారు. రోలుగుంట, కొవ్వూరు, కంచుగుమల తదితర గ్రామాలను ఆమె బుధవారం రైతులతో కలసి వారి పొలాలను సందర్శించి పంటలను ఆశించిన తెగుళ్లను పరిశీలించారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా పచ్చపురుగు, పాచితెగుల సమస్య ఉందని, అలాగే పొడతెగులు, సుడిదోమ కూడా ఆశించే అవకాశం ఉందని, ప్రాథమికంగా గట్లపై ఎదిగి ఉన్న గడ్డిని త్వరితగతిన కోసి పంటకు గాలి వేసే విధంగా బాటలు కూడా వేసుకోవడం మంచిదన్నారు.

తెగుళ్లు తగ్గాకే నత్రజని ఎరువులు వాడాలి

మాడుగుల : మండలంలో ఎల్.పొన్నవోలు, జాలంపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు వరి చేలు పరిశీలించారు. వరి పొలాలకు పాము పొడ, అగ్గితెగు ళ్లు ఆశించాయని, తెగుళ్లు తగ్గిన తర్వాత మాత్రమే నత్రజని ఎరువులు వాడాలని రైతులకు సూచించారు.

కె.కోటపాడు: గుల్లేపల్లి, కె.కోటపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తొంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో ఆకుముడత తెగులు నివారణకు క్లోరిఫైరిపాస్‌ను 2ఎం.ఎల్‌ను ఒక లీటర్ నీటిలో వేసి పిచికారి చేయాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు.

చీడికాడ: చెట్టుపల్లి, వెల్లంకి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎం.రమాదేవి వరి పంటలో పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

దేవరాపల్లి: మామిడిపల్లి, వేచలం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ, శాస్త్రవేత్త కిశోర్‌కుమార్ వరి పొలాలను సందర్శించి ఆకుముడత, సుడి దోమ తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు.

గొలుగొండ: వరి పంటను ఆశించే చీడపీడల నివారణకు రైతులు సూచనలు పాటించాలని ఏవో సుధారాణి తెలిపారు. గాదంపాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు నిధులు



మరమ్మతులు చేపట్టనున్న చింతపల్లి రోడ్డు

నర్సీపట్నం: రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో రహదారుల రూపురేఖలు మారనున్నాయి. మున్సిపాలిటీ, నర్సీపట్నం మండలంలో రహదారులకు రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక మరమ్మతుల కింద రూ.1.65 కోట్లు మంజూరు చేసింది. రహదారుల మరమ్మతుల పనులు ఈ నెలాఖరులోపు వీలైనంత తొందరగా పూర్తి చేసేందుకు అర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. గుంతలు పూడ్చడంతో పాటు దెబ్బతిన్న కల్వర్టుల స్థానంలో కొత్త కల్వర్టులు నిర్మించనున్నారు. విశాఖ–తాళ్లపాలెం రోడ్డుకు రూ.18 లక్షలు, నర్సీపట్నం–కేడీపేట రోడ్డు మరమ్మతులతో పాటు రెండు కల్వర్టుల నిర్మాణానికి రూ.55 లక్షలు, బీసీ కాలనీ రూ.2 లక్షలు, వేములపూడిలో రూ.2 లక్షలు, జోగునాథునిపాలెం రోడ్డు రూ.లక్ష, చింతపల్లి రోడ్డు రూ.4 లక్షలు, లారీయార్డు నుంచి బయపురెడ్డిపాలెం బ్రిడ్జి రోడ్డు రూ.10 లక్షలు, పెదబొడ్డేపల్లి రోడ్డు రూ.10 లక్షలు, పట్టణంలో మెయిన్ రోడ్డు రూ.10 లక్షలు కేటాయించారు. నెలాఖరులోపు పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించామని అర్అండ్‌బీ ఏఈ నారాయణరెడ్డి తెలిపారు.

నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి భార్య లక్ష్మికి నగదు అందిస్తున్న సభ్యులు

కె.కోటపాడు: చౌడువాడకు చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యుడు ధనిమిశెట్టి అప్పన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో పేదరికంలో ఉన్న భవణ నిర్మాణ కార్మికుడి కుటుంబానికి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి నరసింహస్వామి భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు ఆర్థికంగా అండగా నిలిచారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ద్వారా రూ.10 వేలు, ధనిమిశెట్టి వారి కుటుంబాల తరఫున మరో రూ.20 వేల నగదును బుధవారం మృతుడి భార్య లక్ష్మికి అందించారు. మృతుడికి గల ఇద్దరు ఆడపిల్లల చదువులకు అండగా భవన నిర్మాణ కార్మిక సంఘం ద్వారా అండగా ఉండనున్నట్టు ధనిమిశెట్టి మాలిబాబు, బుజ్జి, కల్యాణం, శ్రీను, పైడిబాబు, కొండబాబు పేర్కొన్నారు.

కష్టాల్లో ఖరీఫ్ సాగు

- నాడు నీట ముంపు – నేడు తెగుళ్ల బెడద
- ధరలు పెరిగిన పురుగు మందులు
- ఆవేదనలో అన్నదాతలు



జంపెనలో నీటి ముంపునకు గురైన వరి చేలు(ఫైల్)



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

మాడుగుల: రెండు నియోజకవర్గాలు, మాడుగుల, చోడవరం రైతులకు ప్రధాన ఆధారమైన గోవాడ చక్కెర కర్మాగారం చెరకు రైతులకు పేమెంట్‌లు సక్రమంగా ఇవ్వకపోవడంతో రైతులు ఈ ఏడాది వరి సాగుపై దృష్టి సారించారు. చెరకు సాగు చేసే పొలాలు సైతం వరి సాగు పెంచారు. జిల్లాలో ఈ ఏడాది 3 లక్షల ఎకరాలకు పైగా ఖరీఫ్ వరి సాగు చేయగా మాడుగుల నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాల్లో సాగు చేశారు. పెట్టుబడులు పెట్టి వరి నాట్లు వేసిన 15 రోజులకే తుపాను రావడంతో అప్పట్లో కొంత మేర వరి చేలు నీట ముంపునకు గురయ్యాయి. రైతులు మరలా పోయిన వరి నాట్లు స్థానంలో కొత్తగా మొనలు వేసుకున్నారు. వరి చేలు ఏపుగా ఎదుగుతున్నాయనుకునే సరికి దోమ, పచ్చ తెగుళ్లు తీవ్రంగా ఆశిస్తున్నాయి. 10 రోజులకొకసారి ఎకరాకు సుమారు రూ.1200 ఖర్చు పెట్టి మందులు పిచికారీ చేస్తున్నా సరే తెగుళ్లు తగ్గడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా చేతికి అందడంతో పెట్టుబడులకు రైతులు ఇబ్బందులు పడేవారుకాదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు ఇంకా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి సహాయం అందలేదని, ఖరీఫ్ వరి సాగు కూడా ఆశించిన స్థాయిలో లేదని, రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

ప్రభుత్వ సహాయం అందలేదు



ప్రభుత్వం రైతు భరోసా అందజేయలేదు.అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ఖరీఫ్ వరి సాగు చేశాం, వరి మొనలు వేసిన వెంటనే నీట ముంపునకు గురవడంతో కొంత నష్టపోయాం. ప్రస్తుతం వరి చేలుకు ఎన్నడూ లేని విధంగా తెగుళ్లుఆశిస్తున్నాయి. ఎకరాలకు రూ.1200 చొప్పున 10 రోజులకు ఒకసారి పురుగుమందులు పిచికారీ చేస్తున్నా తెగుళ్లు అదుపులోకి రాలేదు. ఈ ఏడాది వరి చేలకు దిగుబడులు వచ్చే పరిస్థితులు కనిపించలేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. –నలాది అప్పునాయుడు, రైతు, గాదిరాయి